# 2

# మన ప్రోత్సాహమునకు మూలము

## (1:1-4ఎ)

హెబ్రీయుల పత్రికను మనం అధ్యయనం చేయుటకు ప్రారంభించినప్పుడు ఈ పత్రిక "ప్రోత్సాహకర హక్కు" గలది అని చెప్పుకున్నాము. ఈ గ్రంథం ఆరంభంలోనే మన ప్రోత్సాహమునకు ప్రాథమిక మూలము యేసుక్రీస్తు అని నేర్చుకుంటున్నాము. 1-4 వచనాల భాగం నిజంగా లేఖనాలలో గొప్ప భాగం. మన ప్రోత్సాహమునకు యేసే మూలము అని ఆయన అనేక విధాలుగా ఆ మూలముగా అర్హత కలిగియున్నాడని ఈ వచనాలు చెప్తున్నాయి.

### ఆయన కుమారత్వం (1:1, 2ఎ)

"పూర్వకాలమందు నానాసమయములలోను, నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు *కుమారుని ద్వారా* మనతో మాట లాడెను" (1, 2ఎ వచనాలు; నొక్కి చెప్పిందినాది) అన్న మాటలతో పత్రిక ప్రారంభమవుతుంది. రాజు (యేసు) యొక్క మహత్వం మరియు ఆయనకు విరోధులు ఎవరూ లేరన్నది ఈ పత్రిక ప్రారంభ భాగం యొక్క ఉద్దేశం. యేసుని కుమారత్వం ఇక్కడ నొక్కి చెప్పబడింది. కుమారుని పేరు 2:9 వరకు స్పష్టం చేయబడలేదు. మన వాక్యభాగంలో ఆయన కుమారుడు అని పేర్కొనబడినది - అంటే, ఒక హోదా, కుమారునిగా ఒక స్థానం కల్పించబడింది.

### ఆయన ప్రాముఖ్యత (1:2బి, 3)

2వ వచనం రెండో భాగం మరియు 3వ వచనములు కుమారుని ఏడు గుణాలను తెలియజేస్తున్నాయి. ఈ గుణాలు యేసు యొక్క ప్రాముఖ్యతను - గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయి.

*వారసుడు:* "... ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను" (2బి వ.). కుమారుడు కాబట్టి సహజంగా వారసత్వం ఆయనకే చెల్లుతుంది.

*సృష్టికర్త:* "... ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (2సి వ.). "ప్రపంచములు" అన్న మాటకు వాడబడిన మాట "యుగములను" సూచిస్తుంది. ఇక్కడ ఇది ప్రాకృతిక అర్థములోనుండి సర్వ సృష్టిని, విశ్వ కాలమును సూచిస్తుంది. దేవుని కుమారునిగా అన్నిటిని నిర్మించేందుకు ఆయన దేవుని శక్తి కలిగియున్నాడు (చూడు యోహాను 1:3; కొలొస్సయులకు 1:16).

*దేవుని మహిమ యొక్క తేజస్సు:* "ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును" (హెబ్రీయులకు 1:3ఎ). పాత నిబంధనలో దేవుని మహిమ ప్రత్యక్ష గుడారమును నింపింది (చూడు నిర్గమకాండము 40:34-38); ఆయన మహిమ ఆయన్నే ప్రతిబింబిస్తుంది. క్రొత్త నిబంధనలో యేసు దేవుని మహిమను ప్రతిబింబింపజేశాడు. సూర్యుని కిరణాలు సూర్యుని

నుండి ఏలాగు వేరుపరచబడనేరవో అలాగే యేసు కూడ తండ్రినుండి వేరుపరచబడలేడు.

*దేవుని తత్వము యొక్క మూర్తిమంతము:* "ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునై యుండి ..." (3బి వ.). "తత్వము" అనేది దేవుని అంశం లేదా ఆయనలోని సారమును సూచిస్తుంది. ఈ మాటకు "దేవుని స్వభావము యొక్క ఖచ్చిత రూపము" అని అర్థము. మనకు దేవుని వాక్యమును ఇవ్వడానికి మాత్రమే యేసు ఈ లోకమునకు రాలేదు గాని దేవుని *స్వభావమును* మనకు బయలుపరచడానికి ఆయన వచ్చాడు (యోహాను 14:9). ఈ వాక్య భాగంలో ఉపయోగించబడిన ఏడు వర్ణన పదాలు కేవలం దేవుడు ఒక్కనికే సరిపోదగినవి.

*సమస్తమునకు నిర్వహకుడు:* "తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు ..." (హెబ్రీయులకు 1:3సి). ఆయన సమస్తమునకు ఆధారభూతుడు అని కొలొస్సయులకు 1:17 చెప్తుంది. ఆయన దాని నిర్వహించుచు, దాన్ని కాపాడువాడు అని వాక్యభాగం స్పష్టం చేస్తుంది.

*విమోచకుడు:* "పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసి" (3డి వ.). యేసు మన నిమిత్తం తానే పాపపరిహారార్థ బలి అయ్యాడు అని చెప్తూనే, యేసులోని యాజకత్వము ఇక్కడ పరిచయం చేయబడింది. సృష్టికర్తగా యేసుని *శక్తి* మరియు రక్షకునిగా ఆయన *శ్రమ* అనే రెండు విషయములు ఒకే అంశముగా చెప్పడం ద్వారా అవి రెండు పరస్పర విరుద్ధమైనవి కావని చెప్తున్నాయి!

సింహాసనాసీనుడు: "ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను" (3ఇ వ.). ఈ వాక్యం యేసుని ఆరోహణం మరియు కిరీటధారి గురించి చెప్తుంది. "కుడిపార్శ్వము" అనేది ఘనత మరియు శక్తిని సూచిస్తుంది. మన ప్రభువయిన యేసు ఎంతటి ఘనుడు!

## ఆయన ఆధిక్యత (1:4ఏ)

మునుపటి వచనంలోని మాటను 4వ వచనం ముగిస్తుంది: "దేవదూతలకంటే ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారికంటె అంత శ్రేష్ఠుడై ..." తరువాత పాఠములో దేవదూతల కంటే యేసుని ఆధిక్యతను గురించి మనం నేర్చుకుందాము. ఇప్పుడు "శ్రేష్ఠమైన" అను పదమును చూద్దాము. హెబ్రీ పత్రికలో "శ్రేష్ఠమైన" అనేది ముఖ్య పదం. హెబ్రీయులకు 1:4లో యేసు దేవదూతల కంటె శ్రేష్ఠమైనవాడని పేర్కొనబడింది. క్రైస్తవ్యంలో శ్రేష్ఠమైన నిబంధన ఉన్నదని, శ్రేష్ఠమైన బలి ఉందని, శ్రేష్ఠమైన వాగ్దానాలున్నాయని, శ్రేష్ఠమైన నిరీక్షణ ఉందని ... ఇంకను మరిన్ని ఉన్నాయని తరువాత భాగంలో మనం చూస్తాము (చూడు 1:4; 7:19, 22; 8:6; 9:23; 10:34; 11:16, 35, 40; 12:24). 1:4లో "శ్రేష్ఠమైన" అను పదమునకు బదులు NIVలో "అధికమైన" అనే పదం వాడబడింది: "దేవదూతలకంటె ఎంత *అధికమైన* నామము పొందెనో, వారికంటె ఆధికుడై" (నొక్కి చేర్చబడింది).

యేసే మన ప్రోత్సాహమునకు మూలం. ఆయన పుత్రత్వము, ఆయన ప్రాముఖ్యత, ఆయన అధిక్యతనుబట్టి ఆయన అందుకు తగినవాడు.

## ఉపదేశకులకు సూచనలు

### యజమాని, సృష్టికర్త, మరియు రక్షకుడు

ఒక బోధకునిగా, ఉపదేశకునిగా క్రీస్తు యొక్క ఏడు వివరణలను చూసినప్పుడు ఇవి *లోకముతో యేసుకున్న సంబంధమును* వివరించేవిగా చూడగలము: (1) ప్రాపంచిక లోకము, (2) లోకంలోని ప్రజలు, లేదా (3) లోకములో ఆయనకు చెందినవారు (క్రైస్తవులు).

క్రింద ఇవ్వబడిన ప్రతిదానిని చర్చిస్తున్నప్పుడు లోకం (1, 2 లేదా 3) అంటే ఏమిటో మీ విద్యార్థులను అడగండి. కొన్నిసార్లు ప్రశ్నకు ఒకటి కంటే ఎన్నో జవాబులు రావచ్చు. ఉదాహరణకు, "యజమాని" మరియు ఈ లోక "సృష్టికర్తగా" క్రీస్తు యొక్క పాత్ర ప్రాథమికంగా (1) ను సూచిస్తున్నను ఇందులో (2) మరియు (3) కూడ ఉన్నాయి. "లోక రక్షకుని విషయంలో" యేసు ఈ లోక ప్రజలందరికీ రక్షకుడు (2), కానీ విశ్వాసం, విధేయతతో ఎవరు ఆయన్ను అంగీకరిస్తారో వారిని మాత్రమే ఆయన రక్షిస్తాడు (3).

- లోక యజమాని
- లోక సృష్టికర్త
- లోకపు వెలుగు
- లోకమునకు బయలుపరచినవారు
- లోకమును నిర్వహించువాడు
- లోక రక్షకుడు
- లోకము నిమిత్తం విజ్ఞాపన చేయువాడు. [1]

### క్రీస్తు

దేవత్వములో రెండవ వ్యక్తి అయిన కుమారుని గురించి యూదా నేపథ్యపు వివరణలను కూర్చడానికిగల మరో విధానమేమంటే, ఎంతో కాలంనుండి ఎదురు చూస్తున్న మెస్సీయాయైన క్రీస్తు అనే పేరు. ఈ విధానం ద్వారా ఆయన గుణములను చెప్పవచ్చు:

- **C**reator (and Sustainer) సృష్టికర్త మరియు (పోషకుడు)
- **H**eir of all things సమస్తమునకు వారసుడు
- **R**adiation of God's glory దేవుని తేజస్సు
- **I**mage of God దేవుని యొక్క మూర్తిమంతము
- **S**avior రక్షకుడు
- **T**hrone-occupant సింహాసనాసీనుడు

### అభిషేకించబడినవాడు

హెబ్రీలో "మెస్సీయా" మరియు దాని గ్రీకు పదమైన "క్రీస్తునకు," "అభిషిక్తుడు" అని అర్థం. పాత నిబంధనలో ప్రవక్తలు, యాజకులు, రాజులు అభిషేకించబడ్డారు. మన వాక్య భాగంలో, క్రీస్తు అంతిమ ప్రత్యక్షత నొందిన ప్రవక్తగా (1, 2ఎ వచనాలు), అంతిమ

బలియైన యాజకునిగా (3 వ.) దేవుని కుడిపార్శ్వమున కూర్చుని పాలిస్తున్న రాజుగా (3 వ.) కనబడుతున్నాడు.

సూచన

[1]యేసు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి మన నిమిత్తం విజ్ఞాపన చేస్తున్నాడు (రోమీయులకు 8:34; హెబ్రీయులకు 4:14-16).